క్లుప్తంగా

పేదలకు సొంతిల్లు ఉండాలి



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ సింగంపల్లెలో నూతన గృహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంత ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం గృహ యజమానులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ బుడత మధుసూదనరావు, బీసీ నాయకుడు బైలడుగు బాలయ్యయాదవ్, సర్పంచ్ జె.భాస్కర్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

హైవేపై వాహనదారుల వెతలు!



మంగళవారం కందులాపురం సెంటర్‌లో ప్యాచ్ వర్క్ చేస్తున్న కూలీలు

కంభం: అనంతపురం–అమరావతి హైవే రోడ్డుపై గత కొద్ది రోజులుగా సాగుతున్న ప్యాచ్ వర్క్‌లు వాహనదారులకు తంటాలు తెచ్చిపెడుతున్నాయి. హైవే రోడ్డులోని కందులాపురం సెంటర్, ఫ్లయ్ ఓవర్ సమీపంలో, వైజంక్షన్, రావిపాడు రోడ్డు సమీపంలో క్రాక్‌లు ఏర్పడగా చిన్నపాటి మరమ్మతులు చేశారు. అయితే పనుల కోసం వినియోగించిన కంకర చిప్స్, డస్ట్ అలాగే వదిలేయడంతో వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గడిచిన 15 రోజుల్లో ఈ మార్గంలో ఐదు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. అలాగే వాహనాలు తిరుగున్న సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహాలు, దుకాణాల్లోకి దుమ్ము చేరుతుండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిప్స్, డస్ట్‌ను తొలగించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానిక నివాసాల ప్రజలు కోరుతున్నారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రాచర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి డి.థామస్ డిమాండ్ చేశారు. శానిటేషన్ వర్కర్స్ రాజకీయ వేధింపులు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనం ఇవ్వాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలన్నారురు. వర్కర్లను అకారణంగా తొలగిస్తే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవోలు శివకోటేశ్వరరావు, వారణాసి గిరిధర్‌శర్మకు వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, మేరీ, భారతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మార్కాపురం కవులకు సహజ సాహితీ పురస్కారాలు



డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి



కేవీ రమణారెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు, శాసన పరిశోధకుడు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, ఆశ్వ జలకవి కేవీ రమణారెడ్డికి చీరాలకు చెందిన సహజ సాహితీ సంస్థ విశిష్ట పురస్కారాలు ప్రకటించింది. ఈ నెల 22న చీరాలలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. మార్కాపురం పట్టణ రచయితల సంఘం, నెల నెలా వెన్నెల సాహితీ వేదిక, తెలుగు అధ్యాపక సంఘాల ప్రతినిధులు డాక్టర్ కె మధుసూదన్ శాస్త్రి, ఓరుగంటి మల్లిక్, గోపాలుని లక్ష్మీ రమేష్‌బాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కవులు చంద్రశేఖర్, ఎంపీ సుబ్బారావు, డి.వినోద్, వి.చంద్రశేఖర్‌రెడ్డి, తోట శ్రీనివాసరావు,అంజిరెడ్డి తదితరులు అభినందించారు.

ఘనంగా పోలేరమ్మ పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో మంగళవారం పోలేరమ్మ తల్లి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

రామదూత క్షేత్రంలో..

కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో మంగళవారం లక్ష్మీ ధాన్యగణపతికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తైలాభిషేకం చేశారు. వేదపండితుడె అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు, కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



రోడ్డు శుభ్రం చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్



బేస్తవారిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

● స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలో కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి సబ్‌కలెక్టర్ అవగాహన కల్పించారు. అలాగే మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సంవత్సరానికి 100 గంటల చొప్పున పరిశుభ్రతకు సమయం కేటాయించాలని, ఇందులో వారానికి 2 గంటలు కేటాయిస్తే సరిపోతుందన్నారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఈఓఆర్డీ కృష్ణ తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని పరిశుభ్రత, మొక్కల పెంపకంపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీఓ పార్వతి అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బేస్తవారిపేటలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు చెన్నకేశవరెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాసు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీ విగ్రహం సెంటర్ నుంచి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఏఈ శంకర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక నగర పంచాయతీలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీలో కమిషనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ఏఈ భూపాల్‌రెడ్డి, ఏఎస్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తర్లుపాడులో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పరిశుభ్రత, మొక్కల పెంపకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ నరసింహులు పేర్కొన్నారు. ఎంపీపీ భూలక్ష్మి, సర్పంచ్ పి.వరాలు, ఏపీఎం పిచ్చయ్య, ఈఓఆర్డీ బాలకృష్ణ, పంచాయతీ సెక్రటరీ అచ్యుతరావు, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరుతూ మంగళవారం కొనకనమిట్లలో అధికారులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఎంఈఓ–2 నరసింహారావు, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛాత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రాచర్ల సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతిబాయ్, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, వారణాసి గిరిధర్‌శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నఅబ్బాయి, యూఆర్డీ వెంకటేష్, ఎస్సై పి.కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంభం: మండలంలోని దరగా గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ర్యాలీ నిర్వహించి పరిశుభ్రత, పర్యావరణ రక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నూతనంగా నిర్మించిన ఓ గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ మస్తాన్ వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని డీఎల్‌పీఓ భాగ్యవతి పేర్కొన్నారు. మంగళవారం రాయవరం గ్రామంలో ఎంపీడీఓ తోట చందన ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ఈఓఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, ఏపీఓ జీవరత్నం, ఏపీఎం రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్



పొదిలిలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కార్మికులు



తర్లుపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి, అధికారులు

రేపటి నుంచి బాలబాలికలకు క్రీడా పోటీలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19, 20వ తేదీల్లో అండర్–14, 17 విభాగంలో బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, హెచ్‌ఎం ఎంఎస్ శర్మ తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశాలల్లోని వ్యాయమ ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. అర్ధవీడు గురుకుల పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ కోరారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 19, 20న స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కాపురం/పొదిలి: మండలంలోని గజ్జలకొండ జెడ్పీ హైస్కూల్లో, పొదిలి బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19, 20వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మార్కాపురం మండల కోఆర్డినేటర్లు బబూరావు, వెంకటస్వామి, పొదిలి హైస్కూల్ హెచ్‌ఎం కరీమున్‌బీబీ, మండల కోఆర్డినేటర్ ఎం.ప్రసాద్, పీడీ జి.వెంకటరావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మార్కాపురం మండల విద్యార్థులు 90321 13057, 96406 67707ను, పొదిలి మండల విద్యార్థులు 8328399057ను సంప్రదించాలని సూచించారు.

అనంతపురం–అమరావతి హైవే రాచర్ల మీదుగా వేయాలి

రాచర్ల: అనంతపురం–అమరావతి హైవే రోడ్డును కిష్టంశెట్టిపల్లె నుంచి కొండపేట, కోత్తపల్లి, రాచర్ల మండలంలోని సత్యవోలు, మేడంవారిపల్లె, సోమిదేవిపల్లె, బేస్తవారిపేట మండలంలోని జగ్గంబొట్లకృష్ణాపురం, దర్గా, బేస్తవారిపేట జంక్షన్ వరకు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు గిద్దలూరు మీదుగా వేస్తే ట్రాఫిక్ సమస్య ఎక్కువై ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిష్టంశెట్టిపల్లె నుంచి రాచర్ల మండలం మీదుగా బేస్తవారిపేట జంక్షన్ వరకు దాదాపు 30 గ్రామాల మీదుగా ఈ రోడ్డు నిర్మిస్తే వాహనదారులతోపాటు ఆయా గ్రామాల ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అనంతపురం టు అమరావతి హైవేను రాచర్ల మీదుగా వేయాలని30గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నూర్‌బాషాల సమస్యలు పరిష్కరించాలి

తర్లుపాడు: రాష్ట్రంలోని నూర్‌బాషా(దూదేకుల)లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని నూర్‌బాషా యువజన సంఘ అధ్యక్షుడు, తర్లుపాడు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు డి పెద్దమస్తాన్ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ బాజీని విజయవాడలో కలిసి కోరారు. కులధ్రువీకరణ పత్రాల సమస్య పరిష్కరించి, జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



బేస్తవారిపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఏపీఓ



కాకర్లలో మొక్కలు నాటుతున్న ఏపీడీ భాస్కరరావు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని డ్వామా ఏపీడీ ఎస్ భాస్కరరావు అన్నారు. మంగళవారం అర్ధవీడు మండలంలోని కాకర్లలో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత దెబ్బదిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా ఉండేందుకు మొక్కలు నాటాల్సిన అవసరముందని డ్వామా ఏపీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాసరెడ్డి, ఈసీ బెల్లంకొండ కిషోర్‌కుమార్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ప్లాంట్ మదర్–4 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మానవ ఆరోగ్యానికి గాలి, నీరు లాగే మొక్కలు కూడా అవసరమని, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం



పొదిలిలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న కమిషనర్



విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న షరీఫ్

గిద్దలూరు రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అర్బన్ హెల్త్ క్లినిక్ వైద్యుడు షరీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ కలుషిత ఆహారం తినడం వల్ల ఉదరంలో నులి పురుగులు చేరి జీర్ణవ్యవస్థను దెబ్బతీసి రక్తహీనత, అలర్జీని పెంచుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక కేజీబీవీలో బాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలను నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావు పంపిణీ చేశారు. చేతుల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ శరత్ చంద్ర వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ప్రత్యేకాధికారి అనూరాధ, ఏఎన్‌ఎం కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్త హీనతను నివారించవచ్చని కొనకనమిట్ల, గొట్లగట్టు పీహెచ్‌సీల డాక్టర్లు బాలయ్య, పృథ్వీరాజ్, సురేఖ పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. గొట్లగట్టు కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెచ్‌ఎం విజయలక్ష్మి నులిపురుగల నివారణ మాత్రలతో కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు జాజుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొదిలిలో రిజర్వ్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి రిజర్వ్ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి సీఐలు సుబ్బారావు, ఖాజావలి, పొదిలి ఎస్సై వి.వేమన తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో గృహ ప్రవేశాలు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ భూలక్ష్మి, తహశీల్దార్ జయవర్ధన్ హాజరయ్యారు. లబ్ధిదారులకు ఇంటిపట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, సర్పంచ్ పి.వరాలు, హౌసింగ్ ఏఈ నిర్మల్ బాబు, వీఆర్‌ఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తర్లుపాడులో ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ భూలక్ష్మి, తహసీల్దార్

ఘనంగా విశ్వకర్మ జయంతి



బేస్తవారిపేటలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్ సుబ్బారెడ్డి



మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో విశ్వకర్మ స్వామివారు



పొదిలిలో పూజలు చేస్తున్న విశ్వ బ్రాహ్మణులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజ భవనాన్ని నిర్మించడంతోపాటు దేవతల కోసం అనేక అద్భుతమైన ఆయుధాలు తయారు చేసిన విశ్వకర్మ.. పురాతన కాలపు గొప్ప ఇంజినీర్ అని కొనియాడారు. కార్యక్రమంలో విజయ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు గురుస్వామి, ఎం.గ్లోరీ, జి.సారా గ్రేస్, కె.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: విశ్వకర్మ జయంతిని పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకల వృత్తి కళాకారులకు విశ్వకర్మ ఆరాధ్య దైవమని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఈఓ శ్రీనివాసులు, విశ్వకర్మ సంఘ నాయకులు ఆచారి, శ్రీనివాసులు, సురవయ్య, రంగాచారి తదితరులు పాల్గొన్నారు. మార్కాపురం: స్థానిక జడల పిచ్చయ్య మఠంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి ఊరేగించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆలుర్తి పోతులూరయ్య, ఉపాధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆవుల సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక విరాట్ నగర్, చిన్నబస్టాండ్‌లోని నిర్మాణంలో ఉన్న ఆలయాల్లో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినుకొండ శ్యామల, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎంవి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు.

రవాణా కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలి



మార్కాపురంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మార్కాపురం: రవాణా కార్మికుల రక్షణకు సంక్షేమ చట్టం అమలు చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. రవాణా రంగంలో ప్రభుత్వం విధిస్తున్న చలానాలు, జరిమానాలు, రిజిస్ట్రేషన్ ఫీజులు, అధనపు పన్నులు మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, పీఎస్‌ఐ, ఇన్సూరెన్స్, బీమాతో పాటు 50 ఏళ్లు నిండిన డ్రైవర్లకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. 25 శాతం పన్నులు తగ్గించేందుకు జీవో నెం 21ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రామయ్య, ఎస్‌కే మహబూబ్ బాషా, కె.మహేష్, ఎన్.మోజెస్, జి.నగేష్, పి.సుబ్బారావు, ఎన్.మున్నా పాల్గొన్నారు.

పొదిలి: రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు, పట్టణంలో పర్మినెంట్ స్టాండ్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్‌చేశారు. మంగళవారం రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రమేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎద్దు నగేష్, సుబ్బయ్య, ఎ.రాము, సామ్యేల్, వెంకటరావు, ప్రసాదు, రోశయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో డ్రైవర్ల ధర్నా

గిద్దలూరు రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, క్లీనర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయరెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతు డ్రైవర్లకు క్లీనర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. 60 ఏళ్లు దాటిన డ్రైవర్లకు ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నరసింహులు, డ్రైవర్ల యూనియన్ నాయకుడు బ్రహ్మానందరెడ్డి, రంగస్వామి, పి.భూషణం తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ సమస్య పరిష్కారం



విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన చెట్ల తీగలు



చెట్ల తీగలు తొలగించిన తర్వాత..

సాక్షి ఎఫెక్ట్..

రాచర్ల: మండలంలోని రాచర్ల, అనుమలవీడు, పలుగుంటిపల్లె గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన చెట్ల తీగలను ఆ శాఖ అధికారులు తొలగించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యపై ×అల్లుకుపోయిన నిర్లక్ష్యంª శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను గిద్దలూరులోని పొట్టిశ్రీరాములు విగ్రహం సెంటర్ ఆవరణలో మంగళవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. నరేంద్రమోదీ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్లకు దుస్తులు పంపిణీ చేశారు. రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిడతల రమేష్ రెడ్డి,అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా మార్కాపురంలో బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతల కృష్ణ, మహిళామోర్చా జిల్లా కార్యదర్శి మద్దెల లక్ష్మి, పార్టీ నాయకులు రామకృష్ణ, నాగరాజు, వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

బోధనా పద్ధతులను సమీక్షించుకోవాలి

పొదిలి: ఉపాధ్యాయులు అవలంబిస్తున్న బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సమగ్ర శిక్ష మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ సూచించారు. మంగళవారం పొదిలి బాలికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల కాంప్లెక్స్‌లను సందర్శించి పలు సూచనలిచ్చారు. ఏ పద్ధతుల్లో బోధిస్తే పిల్లలకు సులభంగా అర్థమవుతుందో ఉపాధ్యాయులు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, పి.నాగలక్ష్మి, సీఆర్పీలు సుబ్బారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.